క్లుప్తంగా

మాజీ మంత్రికి ఆర్యవైశ్యుల సన్మానం


మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్యవైశ్యులు

చిత్తూరురూరల్(కాణిపాకం): దేవదాయ శాఖ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మంగళవారం చిత్తూరుకు విచ్చేశారు. ఈయనకు ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘనస్వాగతం పలికి సన్మానించారు. అనంతరం కాణిపాక వరసిద్ధుని దర్శనార్థం వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు ఆరూరు ప్రసాద్‌బాబు, నరసింహులు శెట్టి, రవీంద్రబాబు, వెంకటేష్, బాబురావు, నాగేంద్ర, గోవర్ధన్, చంద్రశేఖర్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల నమోదుపై అవగాహన

యాదమరి(బంగారుపాళెం): మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు, నమోదు కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సీహెచ్ఓ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం భవిత కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు అవగాహన కల్పించారు. జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఆదేశాల మేరకు సహిత విభాగం ఆధ్వర్యంలో భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసించే ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు, నమోదు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా మండలంలో పిల్లలను గుర్తించి నమోదు చేసేందుకు ఆరోగ్యశాఖ, సహిత విభాగం సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఈఆర్‌పిలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


పుస్తకాలను అందజేస్తున్న దాతలు

చిత్తూరు కార్పొరేషన్: నగరానికి చెందిన రచయితలు శాంతాభాస్కర్, హరినాయుడు మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాలను వితరణగా అందజేశారు. గ్రంథాలయంలో కార్యదర్శి శర్మను కలిసి వీటిని అందజేశారు. రామాయణం, భాగవతం, నీతి కథలు, మహిళా శాస్త్రవేత్తల విజయగాథల పుస్తకాలను మొత్తం 420 పుస్తకాలను అందజేశారు. పుస్తక పఠనంపై పిల్లల్లో ఆసక్తి పెంచేందుకు వీటిని అందజేసినట్లు దాతలు తెలిపారు. గ్రంథాలయాధికారి మధుబాబు పాల్గొన్నారు.

డీఐఓకు ఉద్యోగ విరమణ సన్మానం


డీఐఓ రవిరాజును సన్మానిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న డీఐఓ రవిరాజుకు చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఘన సన్మానం చేశారు. డీఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతిదేవి, క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, డీఎంఓ శ్రీనివాసులు, వైద్యులు జానకీరావు, శిరీష ఆయనను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

ఏనుగుల సంచారంపై సమాచారం ఇవ్వరూ!

సదుం: గ్రామాలలో ఏనుగులు సంచరిస్తున్నట్లు తెలిస్తే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ట్రాన్స్‌కో ఏడీఏ నరేంద్ర, ఏఈ ఖాదర్ ఇలాహీ మంగళవారం విజ్ఞప్తి చేశారు. కొన్ని రోజుల క్రితం బూరగమంద పరిసర అటవీ ప్రాంతంలో కరెంటు షాక్‌తో ఏనుగు మృతి చెందిందని, ప్రస్తుతం మండలంలో ఏనుగులు సంచరిస్తుండడంతో వాటి గురించి తెలియజేస్తే ఆ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి ఏనుగులు మృత్యువాత పడకుండా చూసేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. విద్యుత్ పరికరాలను ఏనుగులు ధ్వంసం చేసినా సమాచారం ఇవ్వాలని కోరారు.

భోజన కార్మికులకు శిక్షణ

రొంపిచెర్ల: ప్రభుత్వ పాఠశాలలో గోరుముద్ద పథకంలో విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో భోజనం పెట్టాలని ఎంఈఓ ఇందిర ఆదేశించారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకుఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వం పేద పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోందన్నారు. విద్యార్థులకు మధ్యాహ్నం పౌష్టిక విలువలతో భోజనం పెట్టాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమని, ఈ దిశగా మెనూ ప్రకారం రోజూ భోజనం పెట్టాలన్నారు. విద్యార్థులకు పెట్టే భోజనంలో ఎవరూ రాజీ పడకూడదన్నారు. అనంతరం భోజన కార్మికులకు భోజన తయారీపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో బండకిందపల్లె ప్రాథమిక పాఠశాల భోజన తయారీ కార్మికురాలు లక్ష్మి మొదటి స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శ్రీనివాసులు, సీఆర్‌పీలు రాజేంద్ర, కిరణ్, అన్నసూయ, రిసోర్స్ పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళెం: ప్రత్యేక అలంకారంలో వజ్రాలపురం బోయకొండ గంగమ్మ, అమ్మవారి పూజల్లో భక్తులు, అంబలి నివేదన



పోటెత్తిన వజ్రాలపురం బోయకొండ


వజ్రాలపురంలో భక్తుల సందడి


మొగిలి వెంకటగిరిలో కొలువుదీరిన గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయం మంగళవారం భక్తజనంతో పోటెత్తింది. అమ్మవారి 25వ వార్షిక జాతర కార్యక్రమంలో భాగంగా రెండో రోజు అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనంతో అనుగ్రహించారు. ఉదయం అమ్మవారికి అంబలి, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారి మూలవిగ్రహం, ఉత్సవ మూర్తులను వివిధరకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర గ్రామస్తులతో పాటు కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకున్నారు. బొమ్మాయిపల్లెకు చెందిన పారిశ్రామికవేత్త ఈశ్వర్‌నాయుడు, మమత ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, కార్యనిర్వాహకులు గోపి పురుషోత్తం, కమిటీ సభ్యులు శివలింగయ్య, బుస్సా నాగరాజగౌడ్, రాజేంద్రనాయుడు, రామూర్తినాయుడు, సుబ్బా నాయుడు, బుజ్జి, శంకరయ్య, మురళి, తులసి, వేణుగోపాల్‌నాయుడు, పట్టాభి, బాబు, ఆలయ మేనేజర్ మొగిలప్ప పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెంలో మంగళవారం గంగమ్మ జాతర వేడుకగా ప్రారంభం అయ్యింది. ఉదయం అమ్మవారికి అంబలి, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించి బుధవారం వేకువజామున నడివీధిలో కొలువుదీర్చనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొగిలి వెంకటగిరిలో..

మండలంలోని మొగిలి వెంకటగిరిలో మంగళవారం గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నడివీధిలో కొలువుదీర్చిన అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మండలంలోని మొగిలి, తగ్గువారిపల్లె పంచాయతీ ఆర్ఆర్‌నగర్, ఆది ఆంధ్రవాడ, పాలేరు, తుంబకుప్పం గ్రామాల్లో అమ్మవారి జాతర కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. భక్తులు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చిత్తూరు నగరంలో..

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని పలుచోట్ల మంగళవారం గంగజాతరను వేడుకగా నిర్వహించారు. మురుగానిపల్లె, మూడవగేటు, ఇరువారం, కట్టమంచి తదితర ప్రాంతాల్లో వేకువజామునే అమ్మవారిని కొలువుదీర్చారు. తొలిపూజ చేసి తెరను లాంఛనంగా ప్రారంభించారు. భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అంబలి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం విశేష పూజలు చేశారు. పంబ వాయిద్యాల నడుమ భక్తులు అమ్మవారి పూజించారు. రాత్రి పిండివంటలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. రాత్రి వీధి నాటకాలు ప్రదర్శించారు.


మూడవగేటు వద్ద అమ్మవారి పూజల్లో భక్తులు


విశేషాలంకరణలో పాలేటమ్మ, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, అంబలి పోస్తున్న భక్తులు

వైభవంగా పాలేటమ్మ జాతర

ఐరాల: మండల కేంద్రంలో పాలేటమ్మ గంగజాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. జాతరకు భక్త జనం పోటెత్తారు. ప్రధాన వీధులను వేపాకు తోరణాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్డులో ఉదయం అమ్మవారి శిరస్సు ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు నిజరూప దర్శనం కల్పించారు. తొలుత అమ్మవారి మూలవిగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం మహిళలు సామూహికంగా అంబలి పోసి, పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పూజారులు వాటిని భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం మహిళలు పిండి దీపాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త బాలాజి తీర్థప్రసాదాలు అందజేశారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బుధవారం జలధి కార్యక్రమంతో జాతర ముగియనుంది.

పశువులకు వేసవి దెబ్బ

వేసవిలో మనుషులతో పాటు పశువులు కూడా వడదెబ్బకు గురవుతాయి. పశుపోషణలో నిర్లక్ష్యం వహిస్తే వడదెబ్బకు గురై మరణించే ప్రమాదం ఉంది. వడదెబ్బ నివారణ.. పశుపోషణ చర్యలు..చికిత్స తదితరాలను గుడిపాల పశువైద్యాధికారి సాయిసుధ రైతులకు పలు సూచనలు అందజేశారు. పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైగా నమోదవుతుండడంతో రైతులు అవగాహనతో పశుసంపదను జాగ్రత్తగా కాపాడుకోవాలని పేర్కొన్నారు.

- నిర్లక్ష్యం వహిస్తే మరణించే ప్రమాదం
- పోషణ చర్యలపై అవగాహన ఉండాలి
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు


వేసవి తాకిడికి చెట్టు కింద సేదదీరుతున్న పశువులు

గుడిపాల: ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసరణ సరిగా లేని ప్రాంతాల్లో, ఎక్కువ సంఖ్యలో కిక్కిరిసి ఉంచినప్పుడు, నీటి సౌకర్యం అందుబాటులో లేనప్పుడు పశువులు అధిక శ్రమకు గురై వేడిగాలుల తాకిడికి లోనైనప్పుడు వడదెబ్బకు గురవుతాయి. తెల్లజాతి పశువుల కంటే నల్లజాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు లోనవుతాయి.

నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం

బయటి ఉష్ణోగ్రతలు పశువుల శరీర ఉష్ణోగ్రతల కంటే ఎక్కువైనప్పుడు మెదడులోని హైపోథలామస్ స్వేద గ్రంథుల నిర్వహణపై పర్యవేక్షణ కోల్పోతుంది. ఆసందర్భాల్లో చర్మంపై స్వేచ్ఛ గ్రంథులు చెమట ఆధికంగా ప్రసారం చేసి పశువులకు అధిక ఉష్ణోగ్రతలకు లోనుకాకుండా కాపాడుతాయి. అదే సమయంలో చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండ, నాడివేగం పెరుగుతాయి. మూత్రపిండాలు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల మూత్ర విసర్జన కుంటుపడుతుంది. పశువుల ఆరోగ్య పరిస్థితి విషమించి అపస్మారక స్థితిలోకి పోయి శ్వాస ఆడక చనిపోతాయి. పశువుల ఆరోగ్య పరిస్థితి గుర్తించి వెంటనే చికిత్స అందించాలి.


సాయిసుధ, పశువైద్యాధికారి, గుడిపాల

లక్షణాలు: వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 106 డిగ్రీ ఫారన్‌హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. నోటివెంట చొంగ పడుతుంది. పశువులు సరిగ్గా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. నీడకోసం చెట్ల కిందకు చేరతాయి. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీలు దాటితే శ్వాస పీల్చుకోవడం కష్టమవుతుంది. ఫిట్స్ లక్షణాలతో పశువులు క్రమంగా అపస్మారకస్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 105 నుంచి 106 డిగ్రీలు దాటితే ప్రాణాపాయం సంభవిస్తుంది. వడదెబ్బ వల్ల చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువులో పునరుత్పత్తి ప్రక్రియ కుంటుపడి తాత్కాలిక వ్యంధత్వం సంభవిస్తోంది. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది.

చల్లని ప్రదేశంలో పశువులను కట్టాలి.

పశువు వడదెబ్బకు గురైందని గుర్తించిన వెంటనే రైతులు పశువులను నీటితో కడిగి, చల్లని గాలి వీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రతను గమనించి ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరే వరకు పలుమార్లు నీటితో కడగాలి. వెంటనే సమీపంలోని వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించి తగిన చికిత్సలు చేయించుకోవాలి.

నివారణ చర్యలు

- పశుపోషకులు మేలైన యాజమాన్య పద్ధతులు, పోషణ విషయంలో శ్రద్ధ తీసుకుంటే వడదెబ్బ నుంచి పశువులను రక్షించుకోవచ్చు. వేసవిలో పగటివేళల్లో మేతకోసం బయటకు వదల కూడదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉండే సమయాల్లో మాత్రమే బయట తిరగనివ్వాలి. తాగునీటిని ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలి.
- పశువులను రోజూ మూడుసార్లు శుభ్రమైన నీటితో కడగాలి. నాటుజాతి పశువుల కంటే సంకరజాతి పశువులు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. చెరువులు, కుంటలు ఉన్నట్లయితే పశువులను ఈదనివ్వాలి.
- వెలుతురు, గాలి బాగా ప్రసరించేలా ఎత్తైన పశువుల శాలను గడ్డితో నిర్మించుకోవాలి. వడగాలి తగలకుండా గోనె సంచులు కప్పాలి.
- మురుగునీరు, కలుషిత నీరు తాగకుండా చూసుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగేలా ఏర్పాటుచేయాలి.

పారిశుద్ధ్యానికి దుకాణదారులు సహకరించాలి


పారిశుద్ధ్య పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: దుకాణదారులు వ్యర్థాలను ఇష్టానుసారం పడేయకుండా తడి, పొడిగా వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేసి సహకరించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ సూచించారు. నగరంలో బస్టాండ్లు, మార్కెట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, జన సంచార ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను కమిషనర్ మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. వాతావరణం మారుతున్న నేపథ్యంలో నగరంలో మొదటి దశలో చేపడుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా కూరగాయల మార్కెట్లు, చేపల మార్కెట్, జంతువధశాల, షాపింగ్ కాంప్లెక్సులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్, రైతు బజార్లు, పూల మార్కెట్లు, ఇతర జనసంచార ప్రాంతాల్లో గ్యాంగ్ వర్కుల ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పనులను కమిషనర్ తనిఖీ చేసి, సామూహిక పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పాత బస్టాండ్, ఓల్డ్ మార్కెట్, ఏఎస్ఎం కాంప్లెక్స్, ఎంఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద స్థానిక దుకాణాదారులు, వర్తకులతో మాట్లాడారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పక్కాగా చేయాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యంగా ఉండ కూడదన్నారు. గ్యాంగ్‌వర్క్ లను పకడ్బందీగా నిర్వహించి నిర్దేశించిన పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం

- సంక్షేమ పథకాలే విజయానికి సోపానం
- ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు
- పార్టీ నేతలతో ఆత్మీయ సమావేశం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పక్కన ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: అందరి ఆశీస్సులు, సమష్టి కృషితో మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం తథ్యమని, అలాగే పలమనేరు నియోజకవర్గంలోనూ విజయబావుటా ఎగురవేస్తామని ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు జోస్యం చెప్పారు. మంగళవారం పట్టణంలోని ఏకే కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, 2014కు ముందు వి.కోట మండలం టీడీపీకి కంచుకోటగా పేరుండేదని, అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి మూలాన వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా మారిపోయిందన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమ పథకాలే మన విజయానికి సోపానాలన్నారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల నుంచి ముఖ్య నేతల వరకు అందరూ మరోసారి పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కృషిచేశారని, వారందరికీ రుణపడి ఉంటానన్నారు. 2019లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి, రికార్డు బద్దలు కొట్టి, జగనన్నకు బహుమతిగా అందించారన్నారు. పార్టీ సిద్ధాంతాలు, అధిష్టానం చూపిన మార్గదర్శకాలే విజయానికి నాంది అని అన్నారు. 4వ తేదీ వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అత్యధిక సీట్లతో ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ జగనన్న జూన్ 9న సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. సమావేశంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలగురునాథ్, రాష్ట్ర కార్యదర్శి పీఎన్ నాగరాజు, వైస్ ఎంపీపీలు లక్ష్మన్ రెడ్డి, తమీమ్, నాయకులు అబ్బూఖాన్, ధవనంభక్త, తుకారం, ప్రతాప్‌రెడ్డి, కృష్ణమూర్తి, శశికళ, కుమారాజా, శ్రీరాములురెడ్డి, అమరనాథ్, పూలనాగ, భూపతి, శ్రీనివాసులు, దామోదరం తదితరులు పాల్గొన్నారు.


హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు


నేడు కోనేటిరాయుని కల్యాణోత్సవం

గంగవరం: మండలంలో ప్రసిద్ధిగాంచిన టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో బుధవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులు రూ. 300 చెల్లించి సంప్రదాయ దుస్తులతో పాల్గొనవచ్చన్నారు. కల్యాణోత్సవం అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

సదుం: రుతు క్రమం సమయంలో మహిళలు పరిశుభ్రత పాటించాలని సీహెచ్ఓ రషీద్ అన్నారు. రుతుక్రమం, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళల్లో రుతుక్రమం ఆరోగ్యవంతమైన సాధారణ ప్రక్రియ అని తెలిపారు. ఆ సమయంలో తగిన పోషకాహారం, విశ్రాంతి తీసుకోవాలన్నారు. బట్టలకు బదులు శానిటరీ నాప్కిన్స్ వాడాలన్నారు. ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం మహిళకు గాయాలు



పుంగనూరు: ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కింద పడి మహిళ గాయపడిన సంఘటన మంగళవారం మండలంలోని గూడూరుపల్లె సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని సింగిరిగుంటకు చెందిన నందిని(32) కూలీ పనులకు వెళ్లేందుకు తన ద్విచక్రవాహనంలో గూడూరుపల్లెకు వెళ్తుండగా ప్రమాదానికి గురైంది. ఎదురుగా వాహనాన్ని తప్పించబోయే ప్రయత్నంలో ఆమె అదుపు తప్పి కింద పడింది. తీవ్రగాయాల పాలైన ఆమెను స్థానికులు 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం


మిట్టపల్లెలో నిర్వహిస్తున్న ప్రచారం

సదుం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగిన ఉండాలని త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్ కోరారు. మండలంలోని కారేవాండ్లపల్లె, గుట్టపల్లె, గొల్లపల్లె తదితర గ్రామాల్లో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు పెంచల రత్నం, మహేంద్ర, మధు, మల్లేశ్వరి, మధుప్రియ, వెంకటసుబ్బమ్మ, రమణయ్య, రత్తమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో ఆస్పత్రి పాలు


పాము కాటుకు గురైన శ్రీధర్

పుంగనూరు: పాముకాటుకు గురై ఇద్దరు ఆస్పత్రి పాలైన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. వివరా లు.. మండలంలోని బత్తాలపురం గ్రామానికి చెందిన శ్రీధర్ గడ్డివామిలో గడ్డి తీస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. అలాగే చౌడేపల్లె మండలం పుదిపట్లకు చెందిన శ్యామల పొలం పనులు చేస్తుండగా ఉదయం పాముకాటుకు గురైంది. వెంటనే కుటుంబ స భ్యులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. వైద్యసేవలతో ఇద్దరూ కోలుకుంటున్నారు.

డీజిల్, మూడు బైక్‌ల సీజ్

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరులో మంగళవారం స్థానిక ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సెర్చ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 60 లీటర్ల డీజిల్, రికార్డులు సక్రమంగా లేని మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.